AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: కొద్ది రోజులుగా రాకెట్ వేగంగా పెరుగుతున్న బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులో రూ.8 వేలపైగా తగ్గింది. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.78 లక్షలుగా నమోదైంది. ఉదయం 10 గంటల వరకు రేట్లు ఒక్కసారిగా పడిపోయాయి. తులం మేలిమి బంగారం ధర రూ.8,230 తగ్గింది. దీంతో ప్రస్తుతం రూ.1,70,620 పలుకుతోంది. మరోవైపు 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములపై రూ. 7,550 తగ్గి రూ.1,56,400కి చేరింది. కిలో వెండి రూ. 20 వేలకుపైగా తగ్గడంతో సుమారు రూ.లక్షలకు చేరింది.

పీటీ ఉష భర్త శ్రీనివాసన్ కన్నుమూత

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, పరుగుల రాణి పీటీ ఉష భర్త, కేంద్ర ప్రభుత్వ మాజీ ఉద్యోగి వి.శ్రీనివాసన్ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. కేరళలోని వారి నివాసంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆయన మృతిని నిర్ధారించారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హృదయ పోటు కారణంగా ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాసన్ మృతికి స్పందిస్తూ ప్రధాని సంతాపం ప్రకటించారు.

30-1-2026 (friday) MAIN EDITION

ఈఏపీ సెట్ దరఖాస్తుల షెడ్యూల్

అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ ఈఏపీ సెట్ దరఖాస్తుల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 4వ తేదీ తుది గడువు. జేఎన్టీయూ ఆధ్వర్యంలో మే 4వ తేదీ నుంచి 11 వరకు ఈఏపీసెట్ నిర్వహించనున్నారు. అధికారిక నోటిఫికేషన్ ఫిబ్రవరి 23న వెలువడుతుంది.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



అక్షరటుడే, ఏపీ: ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రెండు లైన్లపై గూడ్స్ బోగీలు పడిపోయాయి. రైల్వే సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. స్టేషన్‌లోనే పట్టాలు తప్పడంతో వేరే ట్రాక్‌లపై యథావిధిగా రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి.

నష్టాలతో ముగిసిన ప్రధాన సూచీలు



అక్షరటుడే, బిజినెస్‌డెస్క్: బడ్జెట్ ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యింది. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 619 పాయింట్లు, నిఫ్టీ 171 పాయింట్ల నష్టంతో ప్రారంభమయ్యాయి. చివరికి సెన్సెక్స్ 296 పాయింట్ల నష్టంతో 82,269 వద్ద, నిఫ్టీ 98 పాయింట్ల నష్టంతో 25,320 వద్ద స్థిరపడ్డాయి.

మేడారం జాతరకు గవర్నర్

అక్షరటుడే, ములుగు: మేడారంలో సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తులాభారం నిర్వహించి బంగారం సమర్పించారు. గవర్నర్‌కు మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర్, ఎస్పీ రాంనాథ్ కేకన్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించిన ఆయన, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నల్లమల సాగర్‌తో తెలంగాణకు ద్రోహం : హరీశ్‌రావు

అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ వారే రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నదీ జలాలపై తాము మాట్లాడిన తర్వాత ప్రభుత్వం ఉత్తరాలు రాస్తోందన్నారు. నదీ జలాలపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్ పేరు మారినా, తెలంగాణకు ద్రోహం మారలేదన్నారు. ప్లాన్ ప్రకారమే పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌కు రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో జరిగేది, పేరుకే జల వివాదాల మీటింగ్ అని చెప్పారు. పోలవరం నీళ్లను నల్లమల సాగర్‌కు తరలించడమే దాని ఉద్దేశమన్నారు. ఏపీ ప్రభుత్వం ఒత్తిడితోనే ఢిల్లీలో మీటింగ్ పెట్టారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో కార్చిచ్చు..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: అరుణాచల్ ప్రదేశ్‌లోని లోహిత్ లోయలోని అడవుల్లో కార్చిచ్చు వ్యాపించింది. దీంతో భారత వైమానిక దళం సముద్ర మట్టానికి దాదాపు 9,500 అడుగుల ఎత్తులో మండుతున్న మంటలపై ఎంఐ17వీ5 హెలికాప్టర్ల నుంచి నీటిని జారవిడిచింది. లోహిత్ నదికి ఎదురుగా ఉన్న నిటారుగా, ప్రవేశించలేని గట్ల మీదుగా పనిచేస్తున్న వైమానిక దళ సిబ్బంది మంటల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు చేపట్టారు. ఈ మంటలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

మేడారంలో జన జాతర

వనమంతా జన సందడి నెలకొంది. మేడారం మహా జాతరకు భారీగా భక్తులు పోటెత్తారు. అమ్మలు గద్దెలపై కొలువు దీరడంతో శుక్రవారం మేడారం భక్త జనసంద్రంగా మారింది. వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు భారీగా బారులు తీరారు. నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- గద్దెలపై కొలువుదీరిన అమ్మవార్లు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- రేపు అమ్మవార్ల వన ప్రవేశం

మేడారం మహాజాతరలో భాగంగా గురువారం రాత్రి సామ్మక్క గద్దెపైకి వచ్చారు. అప్పటి నుంచి గంట గంటకు భక్తుల రద్దీ పెరుగుతోంది. దర్శనానికి గంటల తరబడి సమయం పడుతోంది. కొత్తగా నిర్మించిన క్యూ లైన్ కాంప్లెక్స్‌లు నిండిపోయాయి. దీంతో రోడ్డుపైన సైతం భక్తులు బారులు తీరారు.

భారీగా ట్రాఫిక్ జామ్

భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు చేసి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దీంతో జంపన్న వాగు పరిసరాలు, గద్దెల ప్రాంతంలో ఇసుక వేస్తే రాలనంత జనం ఉన్నారు. ఎటూ చూసిన జనమే కనిపిస్తున్నారు. వన దేవతల నామస్మరణతో జాతర మార్మోగుతోంది. మరోవైపు శివసత్తుల పూనకాలతో హోరెత్తుతోంది. లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తుండడంతో ట్రాఫిక్ జామ్ నెలకొంది. తాడ్వాయి నుంచి మేడారం మార్గంలో దాదాపు 8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వీఐపీల తాకిడి

మేడారం జాతరకు భారీగా వీఐపీలు హాజరు అవుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులు అమ్మవార్ల దర్శనానికి వస్తున్నారు. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ శుక్రవారం అమ్మవార్లను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం సమర్పించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క మేడారం మహా జాతర ప్రాముఖ్యత, కొత్తగా నిర్మించిన గద్దెలు, గిరిజన చరిత్ర భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను ఆయనకు వివరించారు.

హార్వర్డ్ యూనివర్సిటీలో ముగిసిన సీఎం రేవంత్‌రెడ్డి కోర్సు

అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోర్సు ముగిసింది. దీంతో ఆయనకు యూనివర్సిటీ ప్రతినిధులు సర్టిఫికెట్ అందజేశారు. హార్వర్డ్‌లోని కెన్నెడి స్కూల్‌లో '21వ శాతబ్దం నాయకత్వం' అనే అంశంపై వారం రోజుల కోర్సు నిర్వహించారు. 62 మంది ప్రపంచ నాయకులు ఈ కోర్సుకు హాజరు కాగా.. అందులో సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఉన్నారు. గురువారం (అమెరికన్ కాలమానం ప్రకారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌లో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సీఎం తరగతులకు హాజరు అయ్యారు. ఆ నెల 25న ప్రారంభమైన కోర్సు వారం రోజుల పాటు సాగింది.

కేసీఆర్‌కు మరోసారి నోటీసులు ఇవ్వనున్న సిట్

అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మరోసారి నోటీసులు ఇవ్వడానికి సిట్ సిద్ధమైంది. ఈ మేరకు లీగల్ ఒపీనియన్ తీసుకుంటుంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు రావాలని సిట్ అధికారులు గురువారం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో తాను రాలేనని కేసీఆర్ సిట్‌కు లేఖ రాశారు. మరో తేదీన విచారణకు పిలవాలని కోరారు. ఈ మేరకు సిట్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆయనకు మరో నోటీస్ ఇచ్చి విచారణకు పిలవనున్నారు. కేసీఆర్ లేఖకు ఈరోజు సిట్ సమాధానం ఇవ్వనుంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అధికారుల స్టేట్‌మెంట్ల ఆధారంగా కేసీఆర్‌కు 160 సీఆర్పీసీ కింద సిట్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. అయితే కేసీఆర్‌ను ఎప్పుడు, ఎక్కడ, ఎన్ని గంటలకు ప్రశ్నిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

అక్షరటుడే, హైదరాబాద్: పోలీస్ కమిషనర్‌ను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మతం పేరుతో దూషించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. 126 (2), 132, 196, 299 బీఎన్ఎస్ సెక్షన్‌లతోపాటు మరికొన్ని సెక్షన్ల కింద ఆయనపై కేసు పెట్టారు. తన నియోజకవర్గంలోని వీణవంకలో జరుగుతున్న మినీ మేడారం జాతరకు పాడి కౌశిక్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. ఆయన తన అనుచరులతో భారీగా వెళ్లారు. అయితే పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. నాలుగు కార్లతో మాత్రమే వెళ్లడానికి అనుమతించారు. దీంతో పాడి కౌశిక్‌రెడ్డి తన భార్య, బిడ్డలతో కలిసి రోడ్డుపై ఖైతాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరగ్గా.. సీపీని మతం పేరుతో దూషించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. తనను అడ్డుకుంటే సంగతి చెబుతానంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.

దానం నాగేందర్‌పై ముగిసిన స్పీకర్ విచారణ

అక్షరటుడే, హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ విచారణ ముగిసింది. ఆయనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆయన అనర్హత పిటిషన్‌పై చాలా కాలంగా సస్పెన్స్ నెలకొంది. ఈ క్రమంలో ఇటీవల స్పీకర్ ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. నోటీసుల మేరకు శుక్రవారం అసెంబ్లీ హాల్‌లో దానం తరఫు న్యాయవాదులు, బీఆర్ఎస్ న్యాయవాదులను స్పీకర్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. కాగా.. స్పీకర్ నోటీసులపై అఫిడవిట్ సమర్పించిన దానం తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదన్నారు. వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లినట్లు చెప్పారు.

తెలుగు తెరపైకి 'ధురంధర్' బ్యూటీ

బాలీవుడ్ బ్యూటీ సారా అర్జున్ 'ధురంధర్' మూవీతో ఇండస్ట్రీని షేక్ చేసిందని చెప్పకోవాలి. హీరోయిన్‌గా మొదటి మూవీతోనే ఊహించని ఫేమ్ దక్కించుకుంది. ప్రస్తుతం ఈ బామ తెలుగు ఇండస్ట్రీకి పరిచయం కానుంది. గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'యుఫోరియా' చిత్రంతో నటిస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్స్‌లోకి విడుదల కాబోతుంది. కాగా.. ప్రమోషన్స్‌లో భాగంగా సారా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. 'ధురంధర్' మూవీపై యాంకర్ ప్రశ్నించగా.. సారా స్పందిస్తూ.. "నేను చేసిన 'ధురంధర్' సినిమా వల్ల నా తల్లిదండ్రులకు ఆనంద భాష్పాలు వచ్చాయి. అదే నా జీవితంలో అత్యంత ఆనందకరమైన రోజు. అది నాకు చాలా ప్రత్యేకమైంది" అని చెప్పకొచ్చింది.

–అక్షరటుడే, సినిమాడెస్క్

తెల్లాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

అక్షరటుడే, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు శుక్రవారం కూల్చివేశారు. చెరువులో ఆక్రమణలను తొలగించారు. తెల్లాపూర్ చెరువులో మట్టి పోసి కొందరు ఆక్రమించారు. దీనిపై గతంలో హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీన హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును పరిశీలించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో మట్టి పోయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల స్వరూపాన్ని మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మట్టి పోసి నింపడానికి అవకాశం లేకుండా ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఈ క్రమంలో చెరువులో నిబంధనలకు విరుద్ధంగా మట్టిపోసి చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం హైడ్రా సిబ్బంది తొలగించారు. ఇలాంటి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.